## క్లుప్తంగా

### కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

గుడిహత్నూర్: వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయడంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. తమ దశాబ్దాల కల నెరవేరిందని, సీఎం కేసీఆర్ తమ జీవితాల్లో గెలుగులు నింపారని వీఆర్‌ఏలు ఆనందం వ్యక్తం చేశారు. కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తామని అన్నారు. వీఆర్‌ఏలు కాంబ్లే పుండలీక్, బాలాజీ, గజ్‌భరే విద్యాసాగర్, లచ్చన్న, కేశవ్, లత, రాజన్న, దయానంద్, సాయన్న ఉన్నారు.

### రైతులకు అండగా ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఉట్నూర్‌రూరల్: రైతులకు ప్రభుత్వం అన్నివిధాల అండగా ఉంటుందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. ఉట్నూర్, ఉమ్రి గ్రామాల్లో రైతు వేదికల్లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. రైతులకు 24 గంటలా కరెంట్ కావాలా.. మూడు గంటల కరెంట్ కావాలో తేల్చుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న క్షమాదేశ్ పాండే

తాంసి: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే పేర్కొన్నారు. మండలంలోని పొన్నారి జెడ్పీ పాఠశాలలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. పాఠశాల స్థాయి నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బడీడు పిల్లలను పాఠశాలకు వెళ్లేలా చూడాలన్నారు. నిరుపేదలకు తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవలందిస్తామన్నారు. సర్పంచ్ అశోక్, ఎంపీటీసీ రేఖ, మాజీ ఎంపీటీసీ రమణ, హెచ్ఎం సంజీవ్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటరమణ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ముత్నూర్‌ను స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలి



ప్లాస్టిక్ డ్రమ్ము పంపిణీ చేస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్‌ను స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీవో సంతోష్ పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో భాగంగా ముత్నూర్‌లో పంచాయతీ సిబ్బంది, అధికారులు మంగళవారం స్వచ్ఛత, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలని అన్నారు. పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దరిచేరవన్నారు. అనంతరం వ్యాపార దుకాణ సముదాయాలకు ప్లాస్టిక్ డ్రమ్ములు పంపిణీ చేశారు. సర్పంచ్ తుమ్రం బాగుబాయి, అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.

### 'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి'



గ్రామస్తులతో మాట్లాడుతున్న భొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని వడోనిలో మంగళవారం ఆయన పర్యటించి గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం బొజ్జును సన్మానించారు. నాయకుడు అబ్దుల్ ఖయ్యూం ఉన్నారు.



బురమయంగా హీరపూర్ రోడ్డు

## అధ్వానంగా రోడ్లు



ఇంద్రవెల్లి: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాల రహదారులు అధ్వానంగా మారాయి. తారు రోడ్లు వరద నీటితో కొట్టుకుపోయాయి. మండలంలోని పోల్లుగూడ, ఖైర్‌గూడ, గోపాల్‌పూర్, మామిడిగూడ, సకారంతాండ, హీరపూర్ గ్రామాల మట్టి రోడ్లు బురదగా మారాయి. దీంతో ప్రజలు, ప్రయణికులు ఇబ్బంది పడుతున్నారు.



## గుంతలమయంగా జాతీయ రహదారి

జైనథ్: మండలం గుండా వెళ్లే జాతీయ రహదారి నం.44 పూర్తిగా గుంతలమయంగా మారింది. భారీ వర్షాలకు తారు లేచి కంకర తేలింది. గుంతల్లో వర్షపు నీరు నిలుస్తోంది. భోరజ్ నుంచి మహరాష్ట్ర బార్డర్ వరకు అడుగడుగునా భారీ గుంతలతో దర్శనమిస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి కావడంతో ట్రాఫిక్ భారీగా ఉంటుందని, అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

### ఒంటి కాలిపై నిలబడి నిరసన



నేరడిగొండ: ఒంటి కాలుపై నిరసన తెలుపుతున్న కార్మికులు

నేరడిగొండ/ఉట్నూర్‌రూరల్/గుడిహత్నూర్/ఇచ్చోడ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. మంగళవారం నాటికి సమ్మె 20వ రోజుకు చేరింది. నేరడిగొండ, ఇచ్చోడలో కార్మికులు ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఉట్నూర్‌లో కార్మికులు తాత్కాలిక వర్కర్ల కాళ్లను కడిగారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఒంటిపై నిలబడి నిరసన తెలిపారు. గుడిహత్నూర్‌లో కార్మికులకు డోంగర్‌గావ్ ఉప సర్పంచ్ సమీనా తాహేర్ ఖాన్ అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకుడు వసీంఖాన్ ఉన్నారు.

## పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం



కాలనీవాసులతో మాట్లాడుతున్న ప్రేమేందర్

కైలాస్‌నగర్: పరిసరాల శుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని తాటిగూడ, మహాలక్ష్మివాడ కాలనీల్లో మంగళవారం నిర్వహించిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కాలనీవాసులతో మాట్లాడి పారిశుధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు. మార్కెట్ యార్డు నుంచి తాటిగూడ వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను పర్యవేక్షించారు. తాటిగూడ, మహాలక్ష్మివాడ కాలనీల్లో నూతనంగా నిర్మిస్తున్న డ్రెయినేజీ, సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు భూమన్న, సంజయ్, నాయకులు కొండ గణేశ్, గజ్జ రాథోడ్, డీఈ తిరుపతి తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి



మాట్లాడుతున్న గేడం సుమన్‌బాయి

ఇంద్రవెల్లి: అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యురాలు గేడం సుమన్‌బాయి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ సభ్యులను మంగళవారం సన్మానించి, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా సుమన్‌బాయి మాట్లాడుతూ అందరికీ సమాన హక్కులు పొందాలనే రాజ్యాంగాన్ని రాసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల గౌరవ అధ్యక్షుడు కాంబ్లే మారుతి, అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి వాగ్మరే కాంరాజ్, ఉపాధ్యక్షుడు పవార్ శివాజీ, కోశాధికారి కాంబ్లే సునీల్, కార్యదర్శి సూర్యకాంత్, బీఎస్పీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్‌వాగ్ దత్త, దళిత సంఘాల నాయకులు కాంబ్లే బాపురావ్, అతిశ్‌కుమార్, రామారావ్, మోరే దిలీప్, సత్యానంద్, మస్కే రాజువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

### న్యూట్రిషన్ కిట్లు పంపిణీ

నార్నూర్: గాదిగూడ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గర్భిణులకు వైస్ ఎంపీపీ యోగేశ్ మంగళవారం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ రవీందర్ తదితరులు ఉన్నారు.

### కాంగ్రెస్‌లో చేరిక

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యుడు జాహెద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి భీముడు వారికి కండువా కప్పారు.

### పరామర్శ

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన పోచ్చన్న 108 వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ మంగళవారం ఆస్పత్రిలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ సదానంద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహేందర్, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

### గొడుగుల పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: దుర్గం ట్రస్ట్ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, యాచకులు, దివ్యాంగులకు మంగళవారం గొడుగులు పంపిణీ చేశారు. రాష్ట్ర మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఆ ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ వీటిని అందజేశారు.

### ఓటరు జాబితాపై అవగాహన

నేరడిగొండ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం గ్రామాల్లోని బీఎల్వోలకు ఓటరు జాబితాపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ పవన్‌చంద్ర మాట్లాడుతూ బీఎల్వోలు తమ పోలింగ్ బూత్ పరిధిలో పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ చేపట్టాలన్నారు. డీటీ భాగ్యలక్ష్మి, ఆర్ఐ నాగోరావు పాల్గొన్నారు.

### విద్యుత్ తీగలు అమర్చవద్దు

తాంసి: అటవీ జంతువుల బారి నుంచి పంటల రక్షణకు రైతులు విద్యుత్ తీగలు అమర్చవద్దని తాంసి అటవీశాఖ సెక్షన్ అధికారి హైమద్ ఖాన్ సూచించారు. భీంపూర్ మండలంలోని గొల్లఘాట్, తాంసి(కె), గుంజాల గ్రామాల్లో రైతులు, గ్రామస్తులకు మంగళవారం అవగాహన కల్పించారు. బీట్ అధికారి సాయి కుమార్, సర్పంచ్ కరీం ఉన్నారు.

### ఆశ్రమపాఠశాలలో వైద్యశిబిరం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని వాన్‌వాట్ గ్రామంలో ఆశ్రమ పాఠశాలలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ రాహుల్ విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

### ఎన్నికల హామీలు నెరవేర్చాలి

బజార్‌హత్నూర్: ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు బత్తిని సుధాకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని శివాజీ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహానికి పార్టీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఇచ్చోడ రహదారిపై ధర్నా చేశారు. వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### యువజన కాంగ్రెస్ సమ్మేళనానికి తరలిన నాయకులు

నేరడిగొండ: కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో బుధవారం నుంచి శుక్రవారం వరకు జరిగే యువజన కాంగ్రెస్ సమ్మేళనానికి జిల్లా నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్‌ను బద్దం పోతారెడ్డి, నాయకులు మంగళవారం కలిశారు.

### సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్‌లోని ఖుర్షీద్‌నగర్‌లోని బాలికల ఆశ్రమ హైస్కూల్ హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీలు కుడ్మెత సంతోష్, జైవంత్‌రావు, ఆదిలాబాద్ మార్కెట్ చైర్మన్ కుమ్ర రాజు కోరారు. మంగళవారం ఐటీడీఏ డీడీ దిపలీకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

### ప్రభుత్వ మొండి వైఖరితోనే సమ్మె

ఎదులాపురం: సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం మొండి వైఖరి కారణంగా కార్మికులు, ఉద్యోగులు సమ్మె చేస్తున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, కోశాధికారి సునీత పాల్గొన్నారు.

### బోథ్ సీఐగా భీమేశ్

బోథ్: బోథ్ సీఐగా భీమేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కిరణ్ కుమార్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో భీమేష్ బాధ్యతలు చేపట్టారు.

### చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

బోథ్: ధన్నూర్ (బి) రైతువేదికలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై మంగళవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

### డివిజన్ కోసం నేడు బోథ్ బంద్

బోథ్: బోథ్ డివిజన్ కోసం చేస్తున్న ఉద్యమం ఉద్యమం తీవ్రతరమవుతుంది. స్థానిక బస్టాండ్ ఆవరణలో చేస్తున్న దీక్షలు 9వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కాంగ్రెస్ నాయకులు కూర్చున్నారు. బుధవారం బోథ్ బంద్ నిర్వహిస్తున్నట్లు సాధన సమితి సభ్యులు పేర్కొన్నారు. దీక్షలో కూర్చున్న వారికి నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, లంబాడ సంఘం సభ్యులు సంఘీభావం తెలిపారు.

### పాఠశాల తనిఖీ

బోథ్: మండల కేంద్రంలోని గిరిజన బాలికల వసతి గృహం, బాలుర ఆశ్రమ పాఠశాలను ఏటీడీఓ సౌజన్య తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్‌కు వివరించారు.

## పంటలను కాపాడే చర్యలు చేపట్టాలి

- ఎమ్మెల్యే జోగు రామన్న



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను కాపాడుకునేలా వ్యవసాయ శాస్త్రవేత్తలు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలను ఎలా కాపాడుకోవాలనే విషయాలను రైతులకు వివరించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు సూచించారు. ఏవోలు, ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి సలహాలు, సూచనలు అందించాలన్నారు. వర్షాలకు జిల్లాలో మొత్తం 40 వేల ఎకరాలు దెబ్బతిన్నాయని, వీటిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాలన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా రైతుబంధు కోఆర్డినేటర్ రమేశ్, డీఏవో పుల్లయ్య, ఆర్డీవో స్రవంతి, కేవీకే కోఆర్డినేటర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులు ప్రారంభం**

దేవుడి పేరు చెప్పి ఓట్లు అడిగేది బీజేపీ నాయకులేనని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని వార్డు నం.33లో పలు అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. స్వయం సహకార సంఘం కమ్యూనిటీ హాల్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సవారీ బంగ్లా షెడ్‌ను స్థానికులతో కలిసి షెడ్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా మొహర్రం పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శైలజ, కౌన్సిలర్ అజయ్, రైతుబంధు సమితి అధ్యక్షుడు రమేశ్, సలీమ్ పాషా, అశోక్, లలిత పాల్గొన్నారు.

### నష్టపరిహారం చెల్లించాలి



దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న శంకర్

బేల: భారీ వర్షాలు, పెన్‌గంగ బ్యాక్‌వాటర్‌తో నష్టపోయిన పంటలను జిల్లా కలెక్టర్‌తోపాటు అధికారులు పరిశీలించి, బాధిత రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పేర్కొన్నారు. మండలంలోని మాంగ్రుడ్, కొగ్దూర్ రెవెన్యూ గ్రామాల శివారుల్లో పెన్‌గంగ బ్యాక్ వాటర్‌తో దెబ్బతిన్న పత్తి, కంది, సోయా పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి, పంట నష్టంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో పంటలు నష్టపోయిన బాధిత రైతులకు ఏవిధమైన నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. జిల్లా నాయకురాలు చిలుకూరి జ్యోతిరెడ్డి, మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, నాయకులు ముకుంద్, మోరేశ్వర్, బర్కాడే రాము, కృష్ణ, రాందాస్, నవీన్ తదితరులు ఉన్నారు.

## నిషేధిత మత్తు పదార్థాలు తరలిస్తే చర్యలు



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

నేరడిగొండ: నిషేధిత మత్తు పదార్థాలను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఇచ్చోడ సర్కిల్ ఎక్సైజ్ శాఖ సీఐ రాజామౌళి అన్నారు. డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద మంగళవారం అధికారులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. నిషేధిత మత్తు పదార్థాలు, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం బాటిళ్లు, దేశీదారు తదితరవి తరలించకుండా వాహనాలను తనిఖీ చేశారు. అధికారులు అశోక్, లక్ష్మణ్ రావు, రాజేశ్వర్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాల అభివృద్ధి




మాట్లాడుతున్న మాజీ ఎంపీ గోడం నగేశ్

ఇచ్చోడ: బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. మండలంలోని సిరిచెల్మ, నారాయణ్‌పూర్, ఫకీర్‌పేట్, నేరడిగొండ(జి), నేరడిగొండ(కె), గోదుమల్యా, ఎల్లమ్మగూడ గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ 9 ఏళ్ల పాలనలో ప్రతీ గ్రామంలో భగీరథ నీరు, పల్లెపార్కు, పంచాయతీకి ట్రాక్టర్, రోడ్లు, 24 గంటలు విద్యుత్ సరఫరా అందుతున్నాయని అన్నారు. గిరిజనులకు పోడు పట్టాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రతీ క్లస్టర్‌కు ఒక్కటి చొప్పున రైతువేదికల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. బోథ్ ఎంపీపీ తులశ్రీనివాస్, తాంసి జెడ్పీటీసీ రాజు, బోథ్ సహకార సంఘం చైర్మన్ ప్రశాంత్, నాయకులు కృష్ణకుమార్, నరాల శ్రీనివాస్, పెందుర్ తుల్సిరాం ఉన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నేరడిగొండ: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీపీయూఎస్ మండల అధ్యక్షుడు ఉత్తంరావ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సంఘం నాయకులతో కలిసి తహసీల్దార్ పవన్‌చంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి పెట్టకపోవడంతో వారు మానసిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీపీయూఎస్ సభ్యులు, ఉపాధ్యాయులు ప్రకాశ్, తుకారాం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### 'నియోజకవర్గ అభివృద్ధి శూన్యం'



నిత్యావసరాలు అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

జైనథ్: గడిచిన 15 ఏళ్లలో ఎమ్మెల్యే జోగు రామన్న హయాంలో ఆదిలాబాద్ నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. మండలంలోని దీపాయిగూడ, ఆనంద్‌పూర్, పెండల్‌వాడ, కౌఠ, సాంగ్వి తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ.. ముంపు బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులు ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలన్నారు. సంతోష్, షకీల్, వసీమ్, రవి, మనోహర్, అశోక్, లక్ష్మణ్, హరీశ్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డి, గంగన్న, నారాయణరెడ్డి ఉన్నారు.

### పంటలు పరిశీలన



పంట చేలు పరిశీలిస్తున్న అశోక్

తాంసి: పెన్‌గంగ నది వరద ప్రవాహంతో ముంపునకు గురై పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు వన్నెల అశోక్ డిమాండ్ చేశారు. భీంపూర్ మండలంలోని అర్లి(టి) శివారులో వరదలతో దెబ్బతిన్న పంటలను నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. వరద బాధిత ఇళ్లను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం నష్టపోయిన బాధితులు, రైతులను ఆదుకోవాలని కోరారు. నాయకులు అశోక్, దాసరి రమేశ్, సంతోష్, నరేశ్‌యాదవ్, రాంరెడ్డి, స్వామి, కిరణ్ తదితరులు ఉన్నారు.

### ముంపు బాధితులను ఆదుకోవాలి



బాధితులతో మాట్లాడుతున్న సుహాసినిరెడ్డి

జైనథ్: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఇళ్లు, పంటలు మునిగిపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కూర గ్రామంలో మంగళవారం ఆమె పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ముంపునకు గురైన చేన్లు పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆమె వెంట నాయకులు లోక కరుణాకర్ రెడ్డి, రాకేశ్, రైతులు ఉన్నారు.

### మొహర్రం ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

తలమడుగు: మొహర్రం ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై ధనశ్రీ సూచించారు. మండలంలోని రుయ్యాడి గ్రామంలో హస్సేన్ హుస్సేన్ దేవస్థానంలో మంగళవారం గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఎస్సై మాట్లాడుతూ మొహర్రం ఉత్సవాలకు వచ్చేవారికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. సర్పంచ్ పోతరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, శ్రీనివాస్, నర్సింగ్ పాల్గొన్నారు.

**జనరేటర్ విరాళం**

రుయ్యాడిలో హస్సేన్ హుస్సేన్ దేవస్థానానికి అదే గ్రామానికి చెందిన లోక విష్ణువర్ధన్ రెడ్డి రూ.5 లక్షల విలువ గల జనరేటర్‌ను విరాళంగా అందజేశారు. మంగళవారం జనరేటర్‌ను మాజీ విజయ డైరీ చైర్మన్ లోక భూమారెడ్డి ప్రారంభించారు.

### తహసీల్దార్ కార్యాలయానికి నిధులు మంజూరు

బోథ్: స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి నిధులు మంజూరైనట్లు జెడ్పీటీసీ సంధ్యారాణి పేర్కొన్నారు. మంగళవారం మంత్రి హరీశ్‌రావు తనకు ఫోన్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేస్తున్నట్లు మంత్రి తనతో పేర్కొన్నారని అన్నారు. రెండు రోజుల్లో భవన నిర్మాణం కోసం జీవో విడుదల చేస్తామని వివరించారు.